సాక్షి
అనంతపురం
సోమవారం। 18। సెప్టెంబర్। 2023



ఆసియా క్రీడలకు అనూష

చైనాలో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత మహిళా క్రికెట్ జట్టులో బండ్లపల్లికి చెందిన బి.అనూషకు చోటు దక్కింది.



టమాట కిలో రూ.8.50

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50 పలికింది. కనిష్టం రూ.2, సరాసరిన రూ.6 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.4°/21.8°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

కళ్యాణదుర్గం/ అనంతపురం అర్బన్/ అనంతపురం క్రైం/ అనంతపురం సిటీ : రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు వారు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని మంత్రి ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధిలో ముందడుగు వేయాలని కలెక్టర్ అభిలషించారు. గణేశ్ పండుగ.. నిమజ్జనం ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ ఘటనలకు, అపశ్రుతులకు తావులేకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని జెడ్పీ చైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వాడొద్దని సూచించారు.

బియ్యం పంపిణీపై సంతృప్తి



శింగనమల స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న కేంద్ర కమిషన్ సభ్యుడు బీఎస్ శర్మ

శింగనమల: జాతీయ ఆహార భద్రత చట్టం అమలు తీరును పరిశీలించేందుకు కేంద్ర కమిషన్ సభ్యుడు బీఎస్ శర్మ ఆదివారం నార్పల, శింగనమలలో పర్యటించారు. నార్పలలోని చౌకడిపో–5, కేశేపల్లిలో చౌకడిపో–8ను తనిఖీ చేశారు. కార్డుదారులను పిలిపించి ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీపై ఆరా తీశారు. బియ్యం సకాలంలోనే అందుతున్నాయని తెలపడంతో కేంద్ర కమిషన్ సభ్యుడు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శింగనమల సివిల్ సప్లయీస్ స్టాక్ పాయింట్‌కు వెళ్లి రికార్డులు పరిశీలించారు. చౌకధాన్యపు డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు బియ్యం ఎలా సరఫరా అవుతోందో అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే 3కిలోల బియ్యం ప్యాకెట్లను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్‌ఓ శోభారాణి, సివిల్ సప్లయీస్ అసిస్టెంట్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, స్టాక్ పాయింట్ అధికారి శంకరయ్య, సీఎస్‌డీటీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీరు



కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం పెరుగుతోంది. ఆదివారం నాటికి డ్యాంలో నీటి నిల్వ 2.82 టీఎంసీలు ఉన్నట్లు ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా రోజూ 200 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి చేరుతోందన్నారు. పీఏబీఆర్ వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి, అనంతపురం, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 70–90 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. మరో 20 క్యూసెక్కులు లీకేజీల రూపంలో బయటకు వెళ్తోందన్నారు.

ఇన్‌స్టంట్ పరీక్షకు 157 మంది హాజరు

అనంతపురం: ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు ఆదివారం అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించారు. డిగ్రీ 5, 6 సెమిస్టర్లలో ఒక్క సబ్జెక్టు ఫెయిల్ అయిన వారికి ఇన్‌స్టంట్ పరీక్షకు అవకాశం కల్పించారు. మొత్తం 158 మంది దరఖాస్తు చేసుకోగా, 157 మంది హాజరయ్యారు.



బొజ్జ గణపయ్యను తీసుకెళ్తున్న యువతి







వినాయక చవితి సందర్భంగా కొనుగోలుదారులతో కిక్కిరిసిన అనంతపురం పాతూరు ప్రాంతం, పూలు కొంటున్న మహిళలు, గణేశ్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై మంటపానికి తీసుకెళ్తున్న యువకుల ఆనంద హేల

లంబోదరా.. నమో నమః

ఏడాదిలో ఎన్ని పండుగలు వచ్చినా 'వినాయక చవితి' తెచ్చే సంబరం..సంతోషం ప్రత్యేకం. పల్లె నుంచి పట్టణం దాకా... మురికివాడల నుంచి ఖరీదైన అపార్ట్‌మెంట్ల వరకు ఎవరిస్థాయిలో వారు అంబరమంటేలా చేసుకునే నిజమైన పండుగ. అనంతపురంతో పాటు జిల్లా అంతటా వాడవాడలా గణేశ్ మంటపాలు ఏర్పాటయ్యాయి. విభిన్న రూపాల్లో రూపుదిద్దుకున్న గణపతి ప్రతిమలను యువకులు కొనుగోలు చేసి మంటపాల వద్దకు ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లారు. సోమవారం చవితినాడు మంటపాల్లో గణనాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు. నగరంలోని వినాయకచౌక్‌లో కమండల వినాయకుడిని కొలువుదీర్చనున్నారు. కర్ణాటక క్షేత్రంగా పేరొందిన చిక్కమగళూరులోని కమండల గణపతి దేవాలయ నమూనాతో విద్యుద్దీప కదలికలతో వినాయక వృత్తాంతాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు పరుచూరు రమేష్ తెలిపారు. మరోవైపు పండుగకు అవసరమైన పూలు, పండ్లు తదితర సామగ్రి దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. – అనంతపురం కల్చరల్

బైజూస్ పాఠాలకు ట్యాబ్‌లు సిద్ధం

- వరుసగా రెండో ఏడాదీ పంపిణీకి చర్యలు
- ఎనిమిదో తరగతి విద్యార్థులు, టీచర్లకు ట్యాబ్‌లు
- రూ.83 కోట్లు ఖర్చు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం



ట్యాబ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రాప్తాడు రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీపడేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. ఇందుకోసం బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు, బోధించే ఉపాధ్యాయులకు అందజేస్తోంది. వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. గతేడాది జిల్లాలో విద్యార్థులు, టీచర్లకు కలిపి మొత్తం 25,400 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఇందుకోసం రూ. 81.28 కోట్లు ఖర్చు చేశారు. ఈ విద్యా సంవత్సరం దాదాపు రూ.83 కోట్లు వ్యయం చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా పదోన్నతులు పొందిన సబ్జెక్టు టీచర్లందరికీ ట్యాబ్‌లు ఇవ్వనున్నారు. బైజూస్ ట్యాబ్‌లు కొనసాగింపుగా పాఠశాలల్లో ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్, స్మార్ట్ టీవీల్లో కూడా బైజూస్ కంటెంట్ చూపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ట్యాబ్‌లు అందజేసే సందర్భంలో ప్రతి ట్యాబ్‌ను కూడా మూడేళ్ల వారంటీతో కొనుగోలు చేయనున్నారు. విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించే క్రమంలో అనుకోని పక్షంలో జరిగే స్క్రీన్ డ్యామేజీకి కూడా ప్రభుత్వమే రిపేరీ చేయించాలని నిర్ణయించింది.

నిరంతర పర్యవేక్షణ..

విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణను ఏర్పాటు చేసింది. డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్నారు. వీరితోపాటు సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లు ప్రతినెలా కనీసం ఒక్కసారి ప్రతి పాఠశాలనూ సందర్శించి ట్యాబ్‌ల పనితీరును చెక్ చేస్తారు. ట్యాబ్‌ల రిపేరీ బాధ్యతలు కూడా వారే చూస్తారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రతి వారం పాఠశాలను సందర్శిస్తారు. ప్రతి శుక్రవారం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడి ట్యాబ్‌లకు వైఫై కనెక్ట్ చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు.

దుర్వినియోగం కాకుండా చర్యలు..

ట్యాబ్‌లను దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వం 'టెక్ట్రో' అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ భాగస్వామ్యంతో ట్యాబ్‌ల్లో యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టింది. మూడు యాప్‌ల (వైఫై, బైజూస్, డిక్షనరీ)ను అందుబాటులో ఉంచింది. అప్‌డేట్ చేయడానికి ఎంఆర్సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి పాఠశాల స్థాయిలోనే అప్డేట్ చేయిస్తున్నారు. అప్‌డేట్ చేసే క్రమంలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే హెల్ప్‌లైన్ (89770 10222, 89775 06444, 89776 09444) నంబర్లకు ఫోన్ చేయొచ్చు.

డిసెంబర్‌లో ట్యాబ్‌ల పంపిణీ



ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిసెంబర్‌లో ట్యాబ్‌లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా విద్యార్థులకు ఉపయోగపడేలా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేస్తోంది. గతేడాది పంపిణీ చేసిన ట్యాబ్‌లపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంది. విద్యార్థులకు చాలా ఉపయోగపడుతున్నాయి.

– వి.నాగరాజు, డీఈఓ

మరమ్మతులకు స్పెషల్ డ్రైవ్



బైజూస్ కంటెంట్ కల్గిన ట్యాబ్‌ల మరమ్మతులకు రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ఈనెల ఒకటి నుంచి జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. స్క్రీన్ రిపేరీ ఉంటే దాదాపు రూ.6 వేలకు పైగా ఖర్చు వస్తుంది. ఈ మొత్తం కూడా ప్రభుత్వమే భరించనుంది. వినియోగంపై తరచూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఓబుళరెడ్డి, బైజూస్ ట్యాబ్‌ల జిల్లా నోడల్ అధికారి

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



సర్వేపై సిబ్బందితో ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

యాడికి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి అన్నారు. ఆదివారం యాడికి–1 సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పీహెచ్‌సీ వైద్యులతో కలిసి ఆమె పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలు, ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. కుటుంబంలో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేసి వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ యాడికి–3 సచివాలయం పరిధిలోని 15వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభమైందన్నారు. సర్వేలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, కంటి తదితర ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు గుర్తించిన వ్యాధుల తీవ్రతను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటారన్నారు. మండలంలో 45 రోజుల పాటు సర్వే జరుగుతుందన్నారు. అంతకు మునుపు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీరామ్ కుమార్, పరమేశ్వర్, సీహెచ్‌ఓ జుబేదాబేగం, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్ గౌడ్ , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల అభ్యున్నతే లక్ష్యం





హోమం, విశ్వకర్మ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జేసీ కేతన్‌గార్గ్ తదితరులు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- ఘనంగా విశ్వకర్మ జయంత్యుత్సవం

అనంతపురం కల్చరల్: విశ్వకర్మ వల్లే చేతి వృత్తులు అభివృద్ధి చెందాయని, అలాంటి చేతివృత్తిదారుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాతూరులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో విశ్వకర్మ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంతతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో దేవతా రూపాలను నైపుణ్యంతో మన కళ్ల ముందు ఆవిష్కరింపజేసిన చేతివృత్తుల కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యంగా విశ్వకర్మ యోజనను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతివృత్తుల వారికి సామాజిక, ఆర్థిక, రాజకీయపరంగా గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం ద్వారా వారికి ఎంతో గౌరవం దక్కినట్లయిందన్నారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ 18 కులాల వారికి విశ్వకర్మ యోజనకు అర్హులని, ఈ పథకం కింద రూ.15 వేలు విలువ కల్గిన టూల్ కిట్, సబ్సిడీ వడ్డీ రేటుతో రూ. లక్ష వరకు, మరో ఏడాది రూ.2 లక్షల వరకు ప్రభుత్వం రుణాలందిస్తోందన్నారు. విశ్వకర్మ యోజన కింద రాష్ట్రంలో 2.50 లక్షల మందికి లబ్ధి చేకూర్చనున్నట్లు వెల్లడించారు. డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ రిజ్వాన్, సీనియర్ న్యాయవాది గురుప్రసాద్ తదితరులు మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాలు విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నాయన్నారు. అంతకు ముందు ఆలయంలో నిర్వహించిన విశ్వకర్మ పూజలు, హోమాలలో ముఖ్య అతిథులు పాల్గొని తీర్థప్రసాదాలందుకున్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, బీసీ సంఘం నాయకులు నాగభూషణం, రమేష్‌గౌడ్, పలు శాఖల అధికారులు శ్రీదేవి, శ్రీధరమూర్తి, ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపన్నులకు ఆర్థిక భద్రత!

పేదలకు సంక్షేమాన్ని దరిజేర్చే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకున్నా వెనకడుగు వేయడం లేదు. 'వైఎస్సార్ బీమా'నే ఇందుకు ఉదాహరణ. బీమా పథకం నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకున్నా.. కంపెనీలు ప్రీమియం పెంచేసినా వెరవకుండా సొంతంగా బీమా పథకాన్ని తీసుకొచ్చి ఆపన్నులకు అండగా నిలిస్తోంది.

- వైఎస్సార్ బీమాతో పేదలకు ధీమా
- కేంద్రం తప్పుకున్నా అమలులో వెనక్కి తగ్గని రాష్ట్ర ప్రభుత్వం
- రూపాయి ప్రీమియం వసూలు చేయకుండానే ఆపన్నహస్తం



అనంతపురం: ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి శోక సంద్రంలో మునిగిన కుటుంబాలకు నేనున్నా అంటూ సీఎం వైఎస్ జగన్ భరోసా కల్పిస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రమూ అమలు చేయని రీతిలో ఉచిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. గతంలో బీమా పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం తన వంతుగా 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సమకూర్చేది. 2020 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం పథకం నుంచి తప్పుకుంది. ఈ క్రమంలో పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వం తన భుజాల మీద వేసుకుంది. తాజాగా బీమా కంపెనీలు సైతం చేతులెత్తేశాయి. అయినా, ఖర్చుకు వెనకాడకుండా పరిహారం నేరుగా చెల్లించేలా కార్యాచరణ ప్రారంభించింది. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2021–22 వరకు మూడు ఆర్థిక సంవత్సరాల కాలంలో 4,379 క్లెయిమ్‌లకు రూ.73.14 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది.

బీమా వర్తింపు ఇలా..

కుటుంబ పెద్ద సహజ మరణం పొందినా లేదంటే ప్రమాదవశాత్తు మరణించినా పరిహారం పొందేలా పథకాన్ని తీర్చిదిద్దారు. 18 నుంచి 50 ఏళ్ల వ్యక్తి సహజంగా మరణిస్తే.. బాధిత కుటుంబానికి రూ.లక్ష చెల్లిస్తారు. 18 నుంచి 70 ఏళ్ల వయసులో ఉన్నవారు ప్రమాదంలో మరణించినా లేదంటే అంగవైకల్యం సంభవించినా రూ.5 లక్షల వరకూ అందిస్తారు. బీమా మొత్తం బ్యాంకు అకౌంట్లలో జమ అవుతుంది. క్లెయిమ్ చేసిన 15 రోజుల్లో డబ్బులు వస్తాయి. లబ్ధిదారుడి కుటుంబానికి తక్షణ ఉపశమనం కింద రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తారు. పేదలు, అసంఘటిత కార్మిక కుటుంబాలపై భారం పడకుండా ప్రభుత్వం బీమా ప్రీమియం ఖర్చు భరిస్తోంది. ప్రస్తుతం వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి సర్వే కొనసాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 5,62,392 మందికి బీమా వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు.

అర్హులు ఎవరంటే:

18 ఏళ్ల నిండి 70 ఏళ్లలోపు వయసు ఉండాలి. బీపీఎల్ కుటుంబానికి చెంది ఉండాలి. తప్పనిసరిగా రేషన్ కార్డు కలిగి ఉండాలి. కుటుంబంలో ప్రాథమికంగా సంపాదించే వ్యక్తి అయి ఉండాలి.

కుటుంబ పెద్ద పేరున పాలసీ



కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండే వ్యక్తి పేరున బీమా పాలసీ తీసుకోవాలి. ఆ వ్యక్తికి ఏదైనా ప్రమాదం జరిగితే బీమా ద్వారా అందే సొమ్ము కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుంది. వాలంటీర్లు కూడా కుటుంబ పోషకుడి పేరునే పాలసీ ఇవ్వాలి.

– ఐ. నరసింహా రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

బాధ్యతాయుతంగా సేవలందిస్తా

- సచివాలయాల్లోనూ 'స్పందన'
- మహిళల ఫిర్యాదులపై తక్షణ చర్యలు
- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- పోలీసు సిబ్బంది అవినీతికి దూరంగా ఉండాలి
- మీడియాతో నూతన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



అనంతపురం క్రైం: బాధ్యతాయుతంగా సేవలందిస్తానని నూతన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. 24 గంటలూ అందుబాటులో ఉంటానని, ప్రజలకు సమస్యలు ఉంటే తన సెల్ నంబర్ 9440796800కు ఫోన్ చేసినా, మెసేజ్ పంపినా వెంటనే స్పందిస్తానని చెప్పారు. ఆదివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లోని తన చాంబర్‌లో పూజా కార్యక్రమాల అనంతరం 11.45 గంటలకు ఆయన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసులు ఎస్పీకి గౌరవవందనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానన్నారు. మహిళా సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కారం చూపుతామన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మున్సిపల్ పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బ్లూకోల్ట్స్, రక్షక్, కమాండ్ కంట్రోల్ విభాగాలను బలోపేతం చేసి దొంగతనాలను నియంత్రిస్తామన్నారు. ప్రతి సోమవారం జిల్లాలోని అన్ని పోలీసు కార్యాలయాలు, పోలీసుస్టేషన్లతో పాటు గ్రామ సచివాలయాల్లో 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మహిళా పోలీసులకు అర్జీలు అందజేయవచ్చన్నారు. వాటిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వీకరించి పరిష్కారం చూపుతామన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతామని తెలిపారు. మరోసారి నేరాలకు పాల్పడితే పీడీ యాక్టు, జిల్లా బహిష్కరణ తప్పదని హెచ్చరించారు.

పోలీసు శాఖ ప్రతిష్ట పెంపొందిద్దాం..

సమన్వయంతో పని చేసి పోలీసు శాఖ ప్రతిష్టను పెంపొందిద్దామని ఎస్పీ అన్బురాజన్ అన్నారు. ఆదివారం జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, తదితర పోలీసు అధికారులతో స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పారదర్శక, నిష్పక్షపాత పోలీసింగ్‌కు కృషి చేద్దామన్నారు. రోడ్డు ప్రమాదాలు, బాడీలీ అఫెన్స్‌లు, దొంగతనాలు ప్రాధాన్యతగా గుర్తెరిగి నివారించాలన్నారు. జిల్లాలో మట్కా, పేకాట ఉండకూడదన్నారు. ముఖ్యంగా సిబ్బంది అవినీతికి దూరంగా ఉండాలని సూచించారు. పోలీసుశాఖ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించేవారి పట్ల కఠినంగా ఉంటామన్నారు. ప్రజల పట్ల జవాబుదారీగా వ్యవహరించాలన్నారు. వినాయక చవితి వేడుకలు, నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు బి.శ్రీనివాసులు, సీఎం గంగయ్య, యు.నరసింగప్ప, జి.ప్రసాదరెడ్డి, బి.వి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి (చిత్రంలో) ఎమ్మెల్సీ మంగమ్మ, లిఖిత

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ, జనసేన పొత్తుతో ఎన్నికల బరిలో దిగినా.. చివరకు గెలిచేది వైఎస్సార్‌సీపీనేనని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ మంగమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖితతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్లు అవినీతి జరిగినట్లు సీఐడీ అధికారుల లోతైన విచారణలో తేలిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు సంబంధించి 13 చోట్ల సంతకాలు చేసింది వాస్తవం కావడంవల్లనే సాక్ష్యాధారాలతో ఆయనను సీఐడీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిందన్నారు. ఇలాంటి తరుణంలో న్యాయస్థానాన్ని విమర్శిస్తూనే కోర్టుపై నమ్మకం ఉందని చెబుతుండడం చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతానికి నిదర్శనమన్నారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకు టీడీపీ నాయకులు, జనసేన పవన్‌కళ్యాణ్ చేస్తున్న పనులు సరైనవి కావన్నారు. 2014లో ఒక్క సీటుకు పోటీ చేయలేని పవన్ కళ్యాణ్ 2019లో వ్యతిరేక ఓటును చీల్చేందుకు బరిలో దిగి ఘోర అవమానం పాలయ్యారన్నారు. 2024 ఎన్నికల్లో ఓ వైపు ఎన్‌డీఏలో భాగస్వాములమంటూనే టీడీపీతో పొత్తు ప్రకటించడం పవన్‌కళ్యాణ్ నిలకడలేని స్వభావానికి నిదర్శనమన్నారు. కాపుల ఆత్మగౌరవానికి భంగం కలిగేలా పవన్‌కళ్యాణ్ వ్యవహరించారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల గురించి ఏ మాత్రం పట్టించుకోని టీడీపీ, జనసేనకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

టీడీపీ, జనసేన పొత్తు అట్టర్ ఫ్లాపే..

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా


మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన పొత్తు అట్టర్ ఫ్లాప్ కానుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఆదివారం తాడిపత్రి పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీల మధ్య పొత్తులు సహజమన్నారు. అయితే ఆయా పార్టీల శ్రేణులు మాత్రం ఈ పొత్తులను ఆదరించే పరిస్థితి ఉండదన్నారు. 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టలేక పొత్తుల కోసం వెంపర్లాడుతున్న పవన్‌కళ్యాణ్‌ను ఎవరూ విశ్వసించడం లేదన్నారు. బీజేపీతో పెళ్లి, టీడీపీతో సంసారం చేసే పవన్‌కళ్యాణ్ నిలకడలేని మనస్తత్వాన్ని ఆ పార్టీ అభిమానులు, నాయకులు అర్థం చేసుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేను విన్నాను... నేను ఉన్నాను అంటూ భరోసా కల్పించి, అధికారం చేపట్టగానే అన్ని వర్గాల సంక్షేమానికి బాటలు వేసిన మహోన్నత నాయకుడు వైఎస్ జగన్ అని అన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీని కాలదన్నిన చంద్రబాబు అనంతరం ఎన్టీఆర్ పంచన చేరి, ఆయనకు వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కొన్న విషయం నేటికీ రాష్ట్ర ప్రజలు మరువలేదన్నారు. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరావును, ఎన్టీఆర్ కుమారుడు హరికృష్ణను, ఆయన కుమారుడు జూనియర్ ఎన్టీఆర్‌ను సైతం వాడుకుని వదిలేసిన చంద్రబాబును నముకున్న వారెవ్వరూ బాగుపడింది లేదన్నారు. కేవలం చంద్రబాబు అడుగులకు మడుగులొత్తేందుకు మాత్రమే పవన్‌కళ్యాణ్ పార్టీ పెట్టాడనే విషయాన్ని గుర్తించాలని ప్రజలను కోరారు. తన స్వార్థం కోసం అభిమానులను, పార్టీ శ్రేణులను ముంచేందుకే టీడీపీతో పవన్‌కళ్యాణ్ పొత్తు పెట్టుకున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య, నాయకులు రామశేఖర్, డీవీ కుమార్, గురుప్రసాదద్‌రెడ్డి, బషీర్ పాల్గొన్నారు.



ఖబడ్దార్ పవన్ కళ్యాణ్

- యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం కార్పొరేషన్: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు... ఖబడ్దార్ పవన్‌కళ్యాణ్' అంటూ జనసేన అధినేతను యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే అత్యంత ఆదర్శవంతమైన పాలననందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోరుపారేసుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్యాకేజీ కోసం టీడీపీతో పొత్తు పెట్టుకున్న పవన్ కళ్యాణ్ బతుకేమిటో అందరికీ తెలుసన్నారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఉండాలని రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నారన్నారు.

నితీష్‌కు ఫిడే క్లాసికల్ రేటింగ్


జొన్నలగడ్డ నితీష్

అనంతపురం: జిల్లాకు చెందిన జొన్నలగడ్డ నితీష్‌కు ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ రేటింగ్‌లో 1,070వ ర్యాంక్ దక్కింది. ఈ మేరకు ఆలిండియా చెస్ ఫెడరేషన్, వరల్డ్ చెస్ ఫెడరేషన్ సంయుక్తంగా ఆదివారం ఫిడే రేటింగ్‌ను విడుదల చేశాయి. అనంతపురంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న నితీష్... ఫిడే ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నేతృత్వంలో శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా నితీష్‌ను పలువురు అభినందించారు.

గ్రూప్-1 విజేతలకు అభినందన


గ్రూప్-1 విజేతలతో ముఖ్య అతిథులు

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని ఓ హోటల్‌లో గ్రూప్-1 టాపర్ల అభినందన సభ ఆదివారం ఘనంగా జరిగింది. ఫర్ ది సొసైటీ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి చిన్న వీరభద్రుడు హాజరై, మాట్లాడారు. ఈ విజేతలు దేశ భవితను తీర్చిదిద్దగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ అధ్యక్షుడు పోతుల రాధాకృష్ణ మాట్లాడుతూ... దృఢ సంకల్పంతో వైకల్యాన్ని జయించి గ్రూప్ 1 విజేతగా నిలిచిన కవిరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఎస్కేయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ సదాశివరెడ్డి, నార్పల తహసీల్దార్ హరికుమార్, కొత్తపల్లి సురేష్ మాట్లాడుతూ... పోతుల రాధాకృష్ణ ఆలోచన స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. విజేతలను సన్మానించుకోవడమంటే మనల్ని మనం గౌరవించుకున్నట్లేనని అభిప్రాయపడ్డారు. అనంతరం గ్రూప్ వన్ విజేతలు శ్రీరామచంద్ర, కవిరాజు, జ్ఞానానందరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ లక్ష్మయ్య, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'షూటింగ్ బాల్' నూతన కమిటీ ఎన్నిక

కళ్యాణదుర్గం: షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం కళ్యాణదుర్గంలో ఎంపిక చేశారు. స్థానిక ఎస్ఎల్ఎన్ డిఫెన్స్ అకాడమీలో జరిగిన ఈ ప్రక్రియకు ఎన్నికల అధికారిగా ఉదయ్‌కుమార్, పరిశీలకులుగా ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షురాలిగా పద్మజ, కార్యదర్శిగా అమరేంద్ర, కోశాధికారిగా ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడిగా మోహన్, సంయుక్త కార్యదర్శిగా అఖిల్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, ఓబన్న, ప్రవీణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ... తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక


లాంగ్ జంప్‌లో పాల్గొన్న క్రీడాకారుడు

అనంతపురం: ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ గుంటూరులోని నాగార్జున వర్సిటీ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగింది. అండర్-14, 16, 18, 20, 23 విభాగాల్లో చేపట్టిన ఈ ప్రక్రియకు మొత్తం 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన 50 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన అండర్14 విభాగంలో టి.రాజేష్, ఎస్.జాన్ అబ్బాస్, ఎస్.భరత్‌కుమార్, ఎస్.బాలాజీ, పి.దయాసాగర్, పి.సుమంత్, ఎస్.ముదాసిర్, జి.మహేష్ బాబు, ఎ.సుశాంత్, బాలికల్లో కె.లీలసాయి, సి.బి.లక్ష్యసాయిరెడ్డి, ఆర్.ఈ ఊహిత ఉన్నారు. అలాగే అండర్-16 విభాగంలో ఈ.భూపతిరెడ్డి, ఎ.దీపక్‌నాయక్, ఎ.మణికంఠ, ఓ.శశికాంత్, బి.శ్రీనివాసులు, ఈ.భరత్‌కుమార్, నరసింహారెడ్డి, జి.నందన్‌రెడ్డి, యూ.ప్రవీణ్, బి.అజయ్‌నాయక్, ఎం.దినేష్, జె.రోహిత్, జె.చంద్రశేఖర్, పి.మనోజ్ కుమార్ ఉన్నారు. అండర్-18లో సి.హర్షవర్ధన్‌నాయక్, బి.మంజునాథ్, బి.అఖిల్ కుమార్, బి.పావల్, బి.మనోజ్, ఎస్.ఇర్ఫాన్, వి.గణేష్, ఎం.జగదీశ్వరరెడ్డి, డి.కుళ్లాయప్ప, బాలికల్లో కె.మౌనదేశాయ్, అండర్ 20 విభాగంలో కె.అఖిల్‌కుమార్, సి.ఇమామ్‌వలి, పి.అన్వర్‌వలి, కె.కార్తీక్, పి.ప్రవీణ్‌కుమార్, ఎస్.రేవంత్‌కుమార్, మహిళల్లో డి.ఆరీఫా ఉన్నారు. అలాగే అండర్ 23 విభాగంలో జి.మధు, ఎస్.ఉదయ్‌కుమార్, సి.గణేష్, కె.ఉదయ్‌శ్రీనివాస్, ఎన్.సాయి, వై.వంశి, కె.అఖిల్, మహిళల్లో టి.చరిత ఎంపికయ్యారు.

బావిలో పడి రైతు మృతి


మృతుడు లక్ష్మీరెడ్డి

పుట్లూరు: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన రైతు లక్ష్మీరెడ్డి (72) ఆదివారం ఉదయం తన పొలానికి వెళ్లి పనుల్లో నిమగ్నమయ్యేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో తన షర్ట్‌ను తొలగించి చెట్టుకు తగిలిస్తుండగా అదుపు తప్పి పక్కనే ఉన్న బావిలో పడ్డాడు. బావిలో ఉన్న మొద్దులపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే పొలం వద్దకెళ్లిన వ్యక్తి ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అటుగా వెళ్లి చూశారు. అప్పటికే బావిలో విగతజీవిగా పడి ఉన్న లక్ష్మీరెడ్డిని వెలికితీశారు. మృతుడి కుమారుడు నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి మృతి


మృతురాలు యశోదమ్మ

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో కొంగు చిక్కుకుని కిందపడడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని ఊడిమి గ్రామానికి చెందిన యశోదమ్మ (70) తన కుమారుడు రాజుతో కలసి ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై రాయదుర్గం మండలం రాతిబావివంక గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని సిరిగెదొడ్డికి సమీపంలోకి చేరుకోగానే యశోదమ్మ చీర కొంగు ద్విచక్రవాహనం వెనుక చక్రానికి చుట్టుకోవడంతో అదుపు తప్పి కిందపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను రాయదుర్గంలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో యశోదమ్మ మృతిచెందింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దక్షిణ భారత్‌లోనే అరుదైన ఆలయం

- విశేష పూజలు అందుకుంటున్న దశభుజ గణపతి


దశభుజ గణపతి నిజరూప దర్శనం

రాయదుర్గం టౌన్: దక్షిణ భారతదేశంలోనే అరుదైన దశభుజ గణపతి ఆలయం వినాయక చవితి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాయదుర్గం కొండపైకి వెళ్లే మార్గంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ గణపతి ఆలయానికి చాలా ప్రత్యేకత ఉంది. ఏకశిలపై దాదాపు 15 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పుతో పది భుజాలతో వినాయకుడిని మలిచారు. కుడి వైపు మొదటి చేతిలో నారికేళం, రెండో చేతిలో చక్రం, మూడో చేతిలో త్రిశూలం, నాలుగో చేతిలో ధనుస్సు, ఐదో చేతిలో అంకుశం ఉంటాయి. ఎడమ వైపు మొదటి చేతిలో భార్య సిద్ధి, రెండో చేతిలో శంఖం, మూడో చేతిలో పవిత్రం, నాలుగో చేతిలో శరం, ఐదో చేతిలో ఖడ్గంతో దర్శనమిస్తుంటాయి. వినాయకుడి తొండం కుడివైపునకు ఉంటుంది. ఈ ఆలయానికి సిద్ధ వినాయక మందిరమని, మహా గణపతి ఆలయమని కూడా పిలుస్తుంటారు. ప్రతి ఆది, మంగళవారాల్లో విశేష పూజలు జరుగుతాయి. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు.



క్లుప్తంగా

మూలమంత్ర బీజాక్షర హోమం



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాల అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు, మూల మంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు నవలావిష్కరణ

అనంతపురం కల్చరల్: విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త సింగెపెరుమాళ్ నారాయణ రచించిన 'దక్షిణ దిశగా ' నవలను సోమవారం ఆవిష్కరించనున్నారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో ఉదయం 10 .30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు, సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాప్తాడురూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛలీగ్ 2.0 కార్యక్రమాన్ని ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా స్వచ్ఛత ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు, యోగా అసోసియేషన్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి రంగనాథ్, నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేను ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధిష్టానం ఇచ్చిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లోకనాథ్ రెడ్డి, నరసింహుడు, శ్రీనా, నాగేంద్ర రెడ్డి, నాగరాజు రెడ్డి, విజయభాస్కర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం

అనంతపురం కల్చరల్: మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయమని హఫీజ్ జావీద్ రబ్బానీ అన్నారు. ఆదివారం స్థానిక నిర్మలానందనగర్‌లో రహమాన్ మసీదులో ఆధ్యాత్మిక సమావేశం జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త హఫీజ్ జావీద్ రబ్బానీ ఆత్మీయ అతిథిగా ప్రవక్తపై వివరించారు. మానసిక ప్రశాంతత ఇచ్చే ఆధ్యాత్మికత వైపు అందరూ మనసు మళ్లించాలన్నారు. సమాజంలో చెడును పారదోలడానికి అందరం ఒకటి కావాలన్నారు. నగర మేయర్ వసీం ఆయన్ను సత్కరించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, మసీదు ముతవల్లి సోహైల్, మసూద్, మెహరాజ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి టమాటా మండీ వద్ద పేకాట ఆడుతున్న 12 మందిని రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ రామకృష్ణారెడ్డి తన సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి టమాటా మండీలోని ఓ చెట్టుకింద పేకాట ఆడుతుండగా దాడి చేశారు. రూ. లక్షా 15 వేలా 920 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు కక్కలపల్లి, అనంతపురానికి చెందిన వారు.

బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్ననాయకులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సుబ్బర చంద్రకళ , అరువుకూర ఓబుళమ్మ, నరసింహులు,శూలం అక్కమ్మకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. ఆత్మకూరులో రెండురోజుల క్రితం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఆర్థికసాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, మాజీ జెడ్పీటీసీ మధు, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి , సచివాలయ కన్వీనర్లు శ్రీరామ్, మురళి, వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, చెన్నారెడ్డి, నరేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దోచేస్తే.. జగనన్న పంచారు!



పథకాల లబ్ధి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర సంపదను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దోచుకుంటే, ప్రస్తుత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పంచి పెట్టారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం కందుకూరులో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలతో లబ్ధి ఏమేరకు చేకూరిందో వివరించారు. ప్రతి ఇంటికీ పథకాల లబ్ధి బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. 'అక్కా...బాగున్నారా?.. మిమ్మల్ని కలిసి రావాలంటూ జగనన్న చెప్పారని' ఎమ్మెల్యే పలకరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు చూశారని, ఏ ప్రభుత్వంలోనైనా ఒక్కో కుటుంబానికి రూ. లక్ష, రెండు, మూడు లక్షల రూపాయలు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యిందా? అని ఎమ్మెల్యే మహిళలను అడిగారు.

సచివాలయాలు, హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభం.. కందుకూరులో కొత్తగా నిర్మించిన సచివాలయ-1,2 భవనాలు, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల గుండె చప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వివిధ పథకాల ద్వారా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయని అన్నారు. ఇంతటి మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీ ఆశీర్వాదం కావాలి తల్లీ అని కోరారు. అనంతరం వలంటీరు రేష్మా గ్రహ ప్రవేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు దుగుమర్రి గోవిందరెడ్డి, బండి పవన్, ఎంపీటీసీ సభ్యులు రాగే రేవతి పెద్దప్ప, ఉప సర్పంచ్ కేపీ ఓబులేసు, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌తోనే వృత్తిదారులకు గుర్తింపు



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతి వృత్తిదారులకు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా గుర్తింపు తెచ్చేందుకు కృషి చేశారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కత్తి, సుత్తి, కొడవలిలాంటి చేతి వృత్తుల పరికరాలను విశ్వకర్మ తయారు చేశారన్నారు. ఎన్నో దేవతా విగ్రహాలకు రూపాన్ని ఇచ్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తుల వారికి ఉపాధి కల్పిస్తున్నారని, వారి కోసం వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వెనుకబడిన వారిని అభివృద్ధి పథంలో నడిపేందుకు కార్పొరేషన్లు తీసుకొచ్చారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, నాయకులు కృష్ణవేణి పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి



టీటీడీ ధర్మప్రచార మండలి ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల పంపిణీ

అనంతపురం రూరల్: మట్టి వినాయకుల్ని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అనంత చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వినాయక చవితి పండగను పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏ నారాయణపురం పంచాయతీలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి. మదన్ మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామాంజులరెడ్డి, మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

అనంతపురం కల్చరల్: పర్యావరణాన్ని రక్షించుకునేందుకు అందరం మట్టి గణపతులనే పూజిద్దామని టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వర్థనాయక్ అన్నారు. తిరుపతి తిరుమల దేవస్థానాల ధర్మప్రచార మండలి సభ్యులు శ్రీపాద వేణు ఆధ్వర్యంలో ఆదివారం మట్టి గణపతుల ఉచిత పంపిణీ జరిగింది. అశ్వర్థనాయక్ మాట్లాడుతూ పర్యావరణ స్పృహ పెరడానికి ప్రభుత్వం అందరిలో చైతన్యం తెస్తోందన్నారు. వేర్వేరు కార్యక్రమాల్లో ఆదరణ సేవా హోమ్‌లో ట్రస్టు అధ్యక్షుడు తాడిమర్రి లాల్‌బాషా, కార్పొరేటర్ శాంతి సుధ, సీనియర్ మహిళా న్యాయవాది నాగేశ్వరి, సేవాఘడ్ ప్రతినిధి బాలా నాయక్, బీజేపీ నాయకులు చిరంజీవిరెడ్డి, శ్రీనాథరెడ్డి, ఆరెస్సెస్ జిల్లా కార్యవాహ పుట్లూరు సుదర్శనరెడ్డి, విభాగ్ కార్యవర్గ జగదీష్, కమల్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అమిటీ క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు, ఎస్ఐ జయపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదురుగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోయి, పర్యావరణానికి ముప్పువాటిల్లుతోందన్నారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో 1000 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శివారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మారుతి, షెక్షా తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులు అందజేత

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వేణుగోపాల్ నగర్ ఆటోస్టాండ్ సర్కిల్‌లో ప్రియాంక క్యాటర్స్ ప్రొద్దుటూరు శీన ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత మట్టి వినాయక ప్రతిమలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మూడో డివిజన్ కార్పొరేటర్ అంకే కుమారమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌రెడ్డి, శివ, శ్రీహరి, హరికృష్ణ, బాల, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న కార్పొరేటర్ అంకే కుమారమ్మ

వినాయక చవితి శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జిల్లా ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. వర్షాలు బాగా కురిసి పాడి పంటలతో ప్రజలు తులతూగాలని ఆకాంక్షించారు. ప్రజలకు విఘ్నాలు తొలగిపోయి సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు.

సచివాలయాల్లో ఆధార్ నవీకరణ

- డీఎల్‌డీఓ ఓబుళమ్మ

అనంతపురం సిటీ: జిల్లాలోని సచివాలయాల్లో ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవచ్చునని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీఓ) చిలంకూరు ఓబుళమ్మ ఆదివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 102 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్‌కు అనుమతి వచ్చిందని వివరించారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో నిర్మలానందనగర్, ఇందిరానగర్, సాయినగర్-1, లక్ష్మీనగర్-2, ఓల్డ్‌టౌన్ ట్యాంక్ ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 28 గ్రామ, వార్డు సచివాలయాల్లో త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు పూర్తయిన వారు వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

క్రీడాకారిణికి ఆర్థిక చేయూత



రాధికకు నగదు అందిస్తున్న హోటల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

అనంతపురం: అంతర్జాతీయ క్రీడాకారిణి రాధికకు ఆపన్న హస్తం అందించారు. ఈమె కెనడాలోని ఓషావాలో అక్టోబర్ 6,7,8 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి లాక్రోస్ క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం వహించనుంది. సాధారణ కుటుంబం, గ్రామీణ నేపథ్యం ఉన్న రాధిక అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది. లాక్రోస్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికస్తోమత లేకపోవడంతో దాతలు ముందుకు వస్తున్నారు. ఇటీవల 'సాఫ్ట్‌గా రాణించి.. రికార్డులు లిఖించి' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. నగరంలోని హోటళ్ల అసోసియేషన్ తరఫున రూ.1.30 లక్షలు నగదు రాధికకు అందించారు. నగదు అందజేసిన వారిలో అనంతపురం హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ రమణ, కార్యదర్శి మహమ్మద్ షబ్బీర్, ట్రెజరర్ జితేంద్ర బాబు, రాష్ట్ర జోనల్ జాయింట్ సెక్రటరీ కే రమణ తదితరులు ఉన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

రాప్తాడు: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని అంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్టేషన్‌లో ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఇటుకలపల్లి సీఐ నరేందర్ రెడ్డితో కలిసి ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఊరేగింపు సమయంలో రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదన్నారు. నిమజ్జనం సమయంలో ఈత రానివారు విగ్రహంతో పాటు నీళ్లలోకి దిగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో మద్యం సేవించకూడదని, బాణాసంచా పేల్చరాదన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కమిటీ నిర్వాహకులపై చర్యలుంటాయన్నారు.

'రోడ్లపైకొచ్చి హడావుడి చేస్తే మరకపోదు'



మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతపురం సెంట్రల్: రోడ్లపైకొచ్చి హడావుడి చేసినంత మాత్రాన అవినీతి మరకపోదని, చంద్రబాబునాయుడుకు చట్టం చుట్టం కాదని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలోని ఆమె చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వంపై నారా బ్రాహ్మణి చేస్తున్న వ్యాఖ్యలను ఆమె ఖండించారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారన్నారు. రూ.వందల కోట్ల ప్రజాధనం కాజేస్తే జైలుకు పంపరా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఉండగా చంద్రబాబునాయుడు ఇలాంటివి ఎన్నో స్కాంలు చేశారని ఆరోపించారు. పోలవరం నిధులు మళ్లింపు, నీరు-చెట్టు, ఆధరణ పనిముట్లు ఇలా ఎన్నో పథకాల్లో రూ.కోట్లు దారిమళ్లించారన్నారు. నిజాలు తెలుసుకోకుండా టీడీపీ మహిళా నాయకులు, చంద్రబాబు కుటుంబ సభ్యులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

సంతల ఆదాయం రూ.3.66 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.66 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,94,360 వసూలయ్యిందని, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,72,130 మేర వసూలైనట్లు తెలిపారు.

మానవ ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: మానవ ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లడంలో అందరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం ఐఎంఏ హాల్‌లో సాంఘిక సమానత్వానికి పునాదులు వేసిన పెరియార్ 145వ జయంతిని పురస్కరించుకొని రాజ్యాంగబద్ధ పౌర సమాజం 100 టీఎంసీ రామాంజనేయులు సదస్సు నిర్వహించారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్, ఆర్ట్స్‌కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రంగస్వామి, డాక్టర్ సురేష్‌బాబు, తదితరులు పాల్గొని ప్రసంగించారు. అవిద్య, అజ్ఞానం, అణచివేత, మూఢత్వం మూర్తీభవించిన సనాతన ధర్మం ఒక వైపు ఉందన్నారు. దేశంలో మానవతావాదం అనేది మానవుల అంతర్గత విలువ, వారి సంక్షేమం, అభివృద్ధికి బలమైన ప్రాధాన్యత ఇచ్చే తాత్విక సాంస్కృతిక దృక్పథం అన్నారు. ఇది గౌరవం, సమానత్వం వ్యక్తులందరి శ్రేయస్సును ప్రోత్సహించే విస్తృతశ్రేణి, ఆలోచనలు, నమ్మకాలు, అభ్యాసాలను కలిగి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సనాతన ధర్మాన్ని అవలంబిస్తోందన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, అసమానతలు లేని సమాజాన్ని తీసుకురావడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వక్తలు చంద్రశేఖర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

అనంతవాసికి జాతీయ అవార్డు గర్వకారణం



నాగేశ్వరయ్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: జిల్లావాసి అయిన బోడిగొల్ల నాగేశ్వరయ్యకు ప్రతిష్టాత్మక జాతీయస్థాయి అవార్డు దక్కడం గర్వకారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో ఇంటర్నేషనల్ సంకల్ప్-2023 అవార్డును బోడిగొల్ల నాగేశ్వరయ్య అందుకున్నారు. ఈసందర్భంగా నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంత వాసికి జాతీయ స్థాయి అవార్డు దక్కడం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. అనంతరం నాగేశ్వరయ్యను సన్మానించారు. కార్యక్రమంలో డీడీపీ ప్రభుదాస్, ఆర్ఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, నార్పల బాలుర వసతి గృహ పూర్వ విద్యార్థులు శివయ్య, టీచర్ సంజప్ప, గడ్డం నాగేపల్లి పెద్దన్న, ఎంసీ పెద్దయ్య, లక్ష్మణ్, ఎల్లుట్ల లక్ష్మయ్య స్వామి, బంగి సుదర్శన్, పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, రమేష్ బాబు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టవేయరా?



శ్రీనగర్ కాలనీ స్మృతివనానికి ఆనుకొని మురుగు కాలువను ఆక్రమించి నిర్మించిన బహుళ అంతస్తుల భవనం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. టౌన్ ప్లానింగ్ నిబంధనలు ఉల్లంఘించి అడ్డదిడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు అటువైపు తొంగిచూడలేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. సులభంగా డబ్బులు ఆర్జించడానికి ఇటీవల ఎలాంటి భవన నిర్మాణ ఫీజులు చెల్లించకుండా షెడ్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. సచివాలయ పట్టణ ప్రణాళిక కార్యదర్శులు కేవలం నోటీసులు జారీ చేసి, తమకేం పట్టదన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. కమిషనర్ భాగ్యలక్ష్మి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేస్తారోలేదో వేచి చూడాలి.



విద్యుత్‌నగర్‌లో కమిషనర్ క్వార్టర్స్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన షెడ్డు

సర్వే పక్కాగా చేపట్టాలి : డీఎంహెచ్‌ఓ

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇంటింటా సర్వేను పక్కాగా పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. శనివారం అనంతపురంలోని రంగస్వామి నగర్‌లో చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. ప్రతి ఇంట్లోని వారి ఆరోగ్య వాస్తవ పరిస్థితిని నమోదు చేయాలన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ నెల 30 నుంచి జరిగే వైద్య శిబిరాల్లో చికిత్సనలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

డాక్టర్ తస్వీన్‌కౌర్‌కు జాతీయస్థాయి అవార్డు



జాతీయ ఐఎస్ఏఆర్ యూత్ ఐకాన్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ తస్వీన్‌కౌర్

అనంతపురం మెడికల్: నగరంలోని చంద్ర హాస్పిటల్ మాత్రికాస్ ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ తస్వీన్ కౌర్ జాతీయస్థాయి అవార్డు లభించింది. పునరుత్పత్తి వైద్యంలో ఆమె అందిస్తున్న సేవలకుగానూ కొచ్చిన్‌లో ఈ నెల 16న రాత్రి జరిగిన కార్యక్రమంలో ఐఎస్ఏఆర్ అధ్యక్షురాలు డాక్టర్ నందితా పాల్షేకర్ యూత్ ఐకాన్ అవార్డును డాక్టర్ తస్వీన్‌కౌర్‌కు అందించారు.

అవయవదానంతో పునర్జన్మ

అనంతపురం మెడికల్: అవయవదానంతో మరికొంతమందికి పునర్జన్మ ప్రసాదించినట్లేనని ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో అవయదానంపై సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు ఆదేశాలతో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్ అవయవదానంపై అవగాహన కల్పించారు.